ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న స్థానిక బీజేపీ నాయకులు

మణికొండ: బీహార్ మాజీ సీఎం, స్వాతంత్ర్య సమరయోధుడు, జన నాయకుడు పేద, వెనబడిన తరగతులు, రైతు సంక్షేమం, హక్కుల గురించి తన జీవితాన్ని అంకితం చేసిన కర్పూరి ఠాగూర్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారతరత్న ప్రకటించటం ఎంతో శుభపరిణామని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఓబీసీ మోర్చా మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ రావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కేంద్ర పాలకులకు దెగ్గరగా ఉన్న వ్యక్తులకు మాత్రమే అవార్డులు వచ్చేవని, ప్రస్తుతం దేశంలో పలు రంగాల్లో విశేష కృషిచేసిన వారిని కేంద్రం గుర్తించి అవార్డులను ఇచ్చి వారికి గుర్తింపు తెస్తోందన్నారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, కో–ఆప్షన్ సభ్యుడు సిద్దప్ప, నాయకులు రాఘవరెడ్డి, వేణుకుమార్, శివరాజు, జైపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, శంకర్, రాజేష్, శివరాంరెడ్డి, రంగబాబు, అనిల్‌లతో పాటు నాయి బ్రహ్మణులు మాణిక్, రాజు, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో..

రాజేంద్రనగర్: నాయి బ్రాహ్మణ వర్గానికి చెందిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న అవార్డు ప్రకటనపై మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ రాజస్వామి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ బొమ్మరాజు నరసింహ, రాష్ట్ర నాయకులు, ఓబీసీ మోర్చా అడిగే రాజు, జిల్లా స్పోర్ట్స్ పర్సన్ ఓబీసీ మోర్చా సంతుగౌడ్, విపత్తుల కన్వీనర్ మధురెడ్డి, రాములుశర్మ, శివాజీ, విష్ణు, మహేష్, నాయి బ్రహ్మణ కులస్తులు వినోద్, గణేష్, రమేష్ తదితరులున్నారు.



ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ రాజస్వామి తదితరులు

పోషకాహార భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



హాజరైన ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్

రెండ్రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు

- బహుళ క్రమశిక్షణతోనే సాధ్యమన్న నిపుణులు

ఏజీవర్సిటీ: ప్రపంచంలో ఆహారం, పోషకాహార భద్రతను నిర్ధారించడానికి విధి విధానాలను రూపొందించడం, అమలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖరన్ అన్నారు. గురువారం మేనేజ్, ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్‌ఆర్‌ఐ), ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ–ఎరిడ్ ట్రాఫిక్స్ (ఇక్రిశాట్) సహకారంతో వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ ద్వారా ఆహారం, పోషకాహార భద్రత అనే అంశంపై రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. 'మేనేజ్' తన వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు, ఇన్‌పుట్ డీలర్లు, అగ్రిప్రెన్యూర్, డిజిటల్ అగ్రికల్చర్ స్కీమ్‌లలో శిక్షణ వంటి పథకాలలో ఆహారం, పోషకాహార భద్రతా కార్యక్రమాలను ప్రధాన స్రవంతిలో చేస్తోందన్నారు. డాక్టర్ జొన్న కేన్ మట్లాడుతూ.. ఆహార, పోషకాహార భద్రతను అనుసందానం చేసుకోవాలన్నారు. ఐఆర్‌ఆర్‌ఐ వరిలో కొనసాగుతున్న పురోగతి, పరిశోధనలను రైతుల స్థాయిలో పరివర్తనాత్మక మార్పును నిర్ధారించడానికి మరింత సహకారం అవసరమన్నారు. పంటల ప్రాముఖ్యత, హర్వెస్ట్‌ప్లస్‌లో కొనసాగుతున్న పరిశోధలను పంచుకున్నారు. బయోఫోర్టిఫైడ్ పంటలను ప్రోత్సహించడానికి విలువ గొలుసు విధానం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వాతావరణ మార్పు, నేల ఆరోగ్యం, నీటి నిర్వహణ, పోషక భద్రత వంటి సమస్యలను పరిష్కరించడానికి బహుళ క్రమశిక్షణా విధానం ద్వారానే ఆహారభద్రతను సాధించడం సాధ్యమవుతుందన్నారు, సుస్థిర ఆహార వ్యవస్థలు, డేటా ఆధారిత వ్యవసాయంతో పాటు మెరుగైన విత్తన వ్యవస్థల ద్వారా ఆహారం, పోషక భద్రతను సమిష్టిగా పరిష్కరించవచ్చన్నారు. ఈ సదస్సులో మిల్లెట్లు, తేనే, కొబ్బరి ,పుట్టగొడుగులు, పండ్లు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులు, సహా 90కి పైగా పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల నుంచి 25 మంది మహిళ అగ్రిప్రెన్యూర్స్ పాల్గొని జాతీయ స్థాయి మహిళా అగ్రిప్రెన్యూర్ ఎగ్జిబిషన్- 2024 నిర్వహించారు. ఐఆర్‌ఆర్‌ఐ, ఇక్రిశాట్, మేనేజ్, సీఐపీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖలోకి వీరభద్రస్వామి ఆలయం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోని తీసుకున్నారు. గురువారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పోలీసు బందోబస్తుతో దేవాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఆలయ పూజారులకు వివరించారు. దీంతో వారు సైతం ఎలాంటి అసమ్మతి లేకుండా అంగీకరించా రు. ప్రస్తుతం వరకు ఉన్న దేవాలయ ఆస్తులను నమోదు చేసుకున్నా రు. సంబంధిత పత్రాలపై ఆలయ పూజారులతో పాటు భక్తులు, గ్రామస్తుల సంతకాలు తీసుకున్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎగ్జిక్యూటివ్ అధికారులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, అంజయ్య, మేనేజర్లు చంద్రమోహన్, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాను పెంచాలని వినతి



జలమండలి మేనేజర్‌కు లేఖను అందజేస్తున్న అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఇంటింటికి నీటి సరఫరా తక్కువగా వస్తుందని, వచ్చే వేసవి కాలంలో బోర్లు వట్టిపోతాయని, నీటి సరఫరాను పెంచాలని టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీ జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని కోరారు. గురువారం జలమండలి కార్యాలయంలో ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టౌన్‌షిప్ పరిధిలో ప్రతి వేసవి కాలంలో ఎక్కువ అపార్టుమెంట్‌లలో బోర్లు వట్టిపోవటంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఈ ఏడాది ప్రతి ఇంటికి జలమండలి కనెక్షన్లు ఉండటంతో నీటిసరఫరా పెంచితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. టౌన్‌షిప్ పరిధిలో జలమండలి పైపు లైన్‌లు వేసే నిమిత్తం రోడ్లను తవ్వి అలాగే వదిలేశారని, దీంతో గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మత్తులు చేయించాలని కోరారు. మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీకి అమెరికా ప్రొఫెసర్లు



విశ్వవిద్యాలయంలో అధికారులతో సమావేశమైన అమెరికా ప్రొఫెసర్లు

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని అలబామాకి చెందినా ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్స్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్, డాక్టర్ బాబ్ బోయిడ్, డాక్టర్ మురళీ ధనశేఖరన్, అలవాలపాటి జానకీ రామిరెడ్డి సందర్శించారు. అనంతరం రిజిస్ట్రార్ వెంకటరమణతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన 12 కాలేజీల్లో వ్యవపాయం సహా 200 డిగ్రీ కోర్సులు అందిస్తున్నామని ఈ సందర్భంగా ప్రొఫెసర్లు తెలిపారు. ఆయా కాలేజీల్లో 91 దేశాలకు చెందిన రెండువేల మంది విద్యార్థులతో పాటు మొత్తంగా 31 వేల మంది చదువుకుంటున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, నూతన వంగడాలపై చేస్తున్న పరిశోధనలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్లకు వివరించారు. ఈక్రమంలో ఆబర్న్ విశ్వవిద్యాలయం, పీజేటీఎస్‌ఏయూ పరస్పరం కలిసి పని చేయాలని నిర్ణయించాయి.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ

బండ్లగూడ: శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలో 5,6,7 డివిజన్‌లోని సాయిరాంనగర్ కాలనీ, సన్‌సిటీ గుట్ట, స్పెషల్ బ్లాక్ కాలనీలలో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయొద్దని సూచించారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ 100 శాతం చేయాలని, ప్రజలు కూడా ఇంటి నుంచి వచ్చే చెత్తను రోడ్లపై వేయకుండా బాధ్యతతో స్వచ్ఛతకు సహకరించాలన్నారు. శానిటరీ జవాన్లు డోర్ టూ డోర్ చెత్త సేకరణపై దృష్టి సారిస్తే రోడ్లపై వ్యర్థాలు ఉండవన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటోడ్రైవర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'టెక్నికల్ ఫెస్ట్ -2024' పోస్టర్ విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న సీబీఐటీ ప్రిన్సిపాల్

మణికొండ: సీబీఐటీ కళాశాలలో ఈనెల 26,27 తేదీల్లో నిర్వహించే టెక్నికల్ ఫెస్ట్ సుధీ–2024, 28,29 మార్చి 1న నిర్వహించే క్రీడా, సాంస్కృతిక ఉత్సవం శృతి–2024ల పోస్టర్లను గురువారం ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుధీ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కృత్రిమ మేదస్సు, డేటా సైన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, టెక్నాలజీ లాంటి విభాగాలు వారి సృజనాత్మకతను తెలియజేసే ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. 'శృతి' కార్యక్రమంలో షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్, ఫేస్ పెయింటింగ్, లిటరరీ యాక్టివిటీస్, డిబేట్, ట్రెజర్ హంట్, స్పోర్ట్స్ డే, రైట్ యాంగిల్, డోల్, దాండియా, కల్చరల్ నైట్ లాంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. శృతి చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సీఐకి శుభాకాంక్షలు



మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న హరికృష్ణారెడ్డికి సీపీఐ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరిస్తామని, గండిపేట మండల ప్రజలకు ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కిషోర్, నాయకులు శంకరయ్య, సత్యం, స్వామి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారక్క గుట్టపై జాతరకు ఏర్పాట్లు



గుట్టపై కొనసాగుతున్న అభివృద్ధి, స్వచ్ఛత పనులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసహిల్స్‌లోని సమ్మక్క సారక్క గుట్టపై జాతరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈనెల 23,24న సమ్మక్క, సారక్క జాతరను నిర్వహించనున్నారు. దీనికోసం గుట్టపై సమ్మక్క, సారక్క గద్దెలతో పాటు పరిసర దేవాలయ ప్రాంగణాలను శుభ్రపరిచి రంగులు వేస్తున్నారు. నీరుడు శ్రీశైలంముదిరాజ్, చంద్రకుమార్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ జాతరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు వివరించారు.

విద్యార్థులకు సాంకేతిక శిక్షణ

అత్తాపూర్: బండ్లగూడలోని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బుధవారం బీటెక్ నాల్గో సంవత్సరం విద్యార్థుల కోసం అంతర్గత సాంకేతిక శిక్షణకు కళాశాల వివిధ ప్రముఖ కంపెనీలతో అనుబంధం ఏర్పచుకుంది. వీటిలో ప్రముఖ కంపెనీలు ఓరాకిల్, ఐబీఎం, ల్యాబ్ కార్ప్, సువీరా ఎనర్జీ, సీగేట్, జీకేఎన్, ఏరియోస్పేస్, అమాదాస్ తదితర కంపెనీలతో అనుబంధం ఏర్పచుకోవడం గర్వకారణమని సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు కళాశాలకు చెందిన 400 మంది విద్యార్థులకు ఈ కంపెనీలలో శిక్షణ పొందడం సంతోషకరమన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనంజయరెడ్డి, ప్రిన్సిపాల్ ఉషశ్రీ, ఇంటర్న్‌షిప్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వి.వి.ప్రతిభ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆటస్థలంలో భవన నిర్మాణ పనులను నిలిపేయాలి



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇలా..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో నిర్మిస్తున్న భవనం పనులను వెంటనే నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓ, ఎంఈఓలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ లేక ప్రభుత్వ స్థలాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆట స్థలాన్ని సమగ్ర శిశు ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ భవనం కోసం నిర్మిస్తున్నారన్నారు. పిల్లల ఆట స్థలంలో భవనం నిర్మించడాన్ని ప్రశ్నించారు. భవనం పనులను వెంటనే నిలిపేసి మూడెకరాల స్థలం ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీని నిర్మించాలన్నారు. పాఠశాలకు ప్రహరీ లేదని, ప్రస్తుతం నిర్మిస్తున్న భవన నిధులతో ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నదే పోలీసుల లక్ష్యం



స్టేషన్ పరిధిలో పర్యటిస్తున్న పోలీసులు

అత్తాపూర్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నదే పోలీసుల లక్ష్యమని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి అన్నారు. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జామున వరకు పర్యటించారు. రాత్రి 12 గంటల తరువాత ఎవరూ.. రోడ్లపై తిరగరాదని హెచ్చరించారు. అవసరమైతే తప్పా హోటళ్లు, పాన్‌షాపులు 12 గంటల లోపే మూసివేయాలని సూచించారు. 12 గంటల తరువాత ఎవరైనా షాపులు తెరిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. యువకులు చెడు వ్యసనాల భారిన పడకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలని, కుటుంబంలో భాగస్వాములుగా ఉంటూ.. గౌరవప్రదంగా జీవిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. ఎస్సైలు నాగరాజు, ఏఎస్సై మహ్మద్ హర్షద్ అలీ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

అత్తాపూర్: శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు వాహనాలకు ఈనెల 2న వాహనాల వేలం పాటను నిర్వహించనున్నట్లు శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు ప్రకటించారు. ఈ వేలంలో టాటా ఏసీ మెగా ఎక్సెల్ ఆటో ట్రాలీ, టాటా ఇంట్రా వీ10 ఆటో ట్రాలీ వాహనాలను శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. శంషాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 178 వద్ద వాహనాలకు వేలం ఉంటుందన్నారు.

సత్కారం

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం తెలంగాణ సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీని బొక్క బాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. – రాజేంద్రనగర్



వాహనాలను జాగ్రత్తగా నడపాలి

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ




విధిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గచ్చిబౌలి: రోడ్డు భద్రతపై ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, శ్రీరామ్ లైఫ్ పార్టనర్స్ సంయుక్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు. వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి రణవీర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ప్రభావం కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తారుమారు చేస్తుందన్నారు. ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, కారుల్లో వెళ్ళేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు హెడ్ రవికుమార్, ప్రాజెక్ట్ హెడ్ సునీత సాంబరాజు మాట్లాడుతూ భద్రతతో పాటు బీమా ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన అవసరమన్నారు. అనంతరం రైడర్లకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నవేద్‌ఖాన్, కేశవ్‌బండారి, ట్రాఫిక్ సిబ్బంది, శ్రీరామ్ లైఫ్ పార్టనర్స్ బృందం పాల్గొన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్‌లో క్రీడా సందడి

ఘనంగా వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024



వాలీబాల్ ఆడుతున్న పోలీసు సిబ్బంది

రాయదుర్గం: నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసు సిబ్బంది ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొని సందడి చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సీపీ అవినాష్ మహంతి ఇతర పోలీసు అధికారులతో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జోన్‌ల నుంచి వచ్చిన పోలీసు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

క్రీడలతో ఒత్తిడి దూరం: సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

విధి నిర్వహణలో ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు దోహదం చేస్తాయని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. క్రీడా పోటీలను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యం, మానసికోల్లాసం కోసం ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక ధృడత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. తెలంగాణ పోలీసు సిబ్బంది ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారన్నారు. సైబరాబాద్ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న పోటీల్లో వివిధ జోన్లు, విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 1000 మందికి పైగా సిబ్బంది పోటీల్లో పాల్గొంటున్నారని, వారిలో 150 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు నర్సింహ, శ్రీనివాసరావు, డాక్టర్ జి వినీత్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, నితికాపంత్, రవిచందన్‌రెడ్డి, అశోక్, కె శిల్పవల్లి, రషీద్, సృజనా కర్ణం, ఏడీసీపీలు రష్మీ పెరుమాళ్, షమీర్, శ్రీనివాసరావు, జి నర్సింహా రెడ్డి, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీపీఐ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ వెట్‌ల్యాండ్ డే

మణికొండ: ప్రపంచ వెట్‌ల్యాండ్ దినోత్సవం సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ధృవాన్ష్ సంస్థ నిర్వాహకురాలు మధులిక తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరవుతారని ఆమె తెలిపారు. వెట్‌ల్యాండ్ వాక్, ఫోటో ఎగ్జిబిషన్, పోస్టర్ కాంపిటీషన్, ప్రాజెక్టు కాంపిటీషన్, ఫ్లోటింగ్ ఐలాండ్ ప్రారంభోత్సవం, మొక్కలు నాటే కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం కలిశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కేసీఆర్‌ను గాంధీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయానికి కష్టపడాలని సూచించారు.

కరెంట్ మీటర్‌కు మొబైల్ నంబర్‌ను లింక్ చేసుకోవాలి

రాజేంద్రనగర్: ప్రతి కరెంట్ మీటర్ నెంబరుకు వినియోగదారుడి మొబైల్ నెంబరును అనుసందానం చేసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ గోపయ్య, డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్‌రావు వినియోగదారులకు సూచించారు. గురువారం శివరాంపల్లిలోని ప్రజాభవన్ కమ్యూనిటీహాల్‌లోని విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదేశాల మేరకు విద్యుత్ మీటర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచేందుకు వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఈ రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వం నుంచి త్వరలో అమలు కానున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకున్నప్పుడే మీరు వాడుతున్న విద్యుత్ వినియోగంపై సమాచారం డిపార్ట్‌మెంట్ దగ్గర ఉంటుందన్నారు. దీనికోసం మీటర్ రీడర్లకు సహకరించి ప్రతి వినియోగదారుడు ఫోన్ నంబరును అనుసందానం చేసుకోవాలన్నారు. విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రీనివాస్, హరినాథ్‌చారి, హతిరాం, ప్రవీణ్, జుబేరుద్దీన్, భాష, సురేష్ రెడ్డి, జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు రవీందర్, వేణుగోపాల్ సబ్ ఇంజినీర్లు లైనింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టిజన్లు, మీటర్ రీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ గోపయ్య

చేయూత

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక నాయకుడు సంజీవరెడ్డి చేయూత ఇచ్చారు.నానక్‌రాంగూడలో ప్రభుత్వ పాఠశాలలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భవన్‌లో మరొక అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి.ఈ కేంద్రాలకు డోర్ మ్యాట్‌లను, వాటర్ క్యాన్లను అంగన్‌వాడీ టీచర్లకు అందించారు.

